సాక్షి

పార్వతీపురం మన్యం

శుక్రవారం । 7 । జూన్ । 2024



కాటేసే కాలం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వానాకాలం ప్రారంభంలో విషసర్పాల బెడద ఎక్కువగా ఉంటుంది. రైతన్నలంతా అప్రమత్తంగా ఉండాలి. - 8లో



విత్తనోత్పత్తి రైతులే చేసుకోవాలి

పంటల సాగుకు విత్తన ఎంపికే కీలకం. విత్తు కొద్దీ చెట్టు అనే సామెత నిజం కావాలంటే ముందు విత్తనం నాణ్యమైనదై ఉండాలి. - 8లో



ఒక్క ఫోన్ చేస్తే చాలు

సమాజంలో జరుగుతున్న విపత్కర పరిస్థితుల కారణంగా మహిళలు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

పైడితల్లి సేవలో అశోక్ కుటుంబం




పైడితల్లి అమ్మవారికి పూజలు చేస్తున్న అశోక్ కుటుంబ సభ్యులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారిని ఆలయ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు దంపతులు, కుమార్తె, విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గురువారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ ప్రసాదరావు ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు వేదాశీస్సులు, అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

9న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బొబ్బిలి: పట్టణంలోని సంస్థానం ఉన్నత పాఠశాలలో 1969-70 పదో తరగతి, రాజా కాలేజీలో 1970 నుంచి 1976 వరకూ ఇంటర్, బీకాం డిగ్రీ చదువుకున్న పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఈ నెల 9న నిర్వహించనున్నట్టు నిర్వాహక కమిటీ కోఆర్డినేటర్ సీతారామ ప్రసాద్, ప్రధాన సలహాదారు ఆర్‌పీఎస్ రాఘవరావు తెలిపారు. రాజా కాలేజీలో ఆ రోజు ఉదయం 10 గంటలకు జరిగే సమ్మేళనంలో ఉపాధ్యాయ, అధ్యాపకులను సత్కరించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. మరిన్ని వివరాలకు పూర్వ విద్యార్థులు సెల్: 96184 04013ను సంప్రదించాలని కోరారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాయులు రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపుతున్న బ్రాహ్మణకార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు

రామభద్రపురం: ఎన్నికల ఫలితాల అనంతరం బ్రాహ్మణకార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పదవికి డబ్ల్యూఎస్ రాయులు రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను కార్పొరేషన్ చైర్మన్‌కు గురువారం పంపించారు. తక్షణమే తన రాజీనామాను అంగీకరించాలని కోరారు. జీవితాంతం మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు వెంట నడుస్తానని తెలిపారు.

నేటి నుంచి కేంద్ర వైద్య బృందం పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివకుమార్

సాలూరు: పార్వతీపురం మన్యం జిల్లాలో శుక్రవారం నుంచి కేంద్ర వైద్య బృందం పర్యటించనున్నట్టు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.శివకుమార్ తెలిపారు. సాలూరు పట్టణంలోని వైటీసీలో మామిడిపల్లి పీహెచ్‌సీ, మెంటాడ వీధి, తెలగావీధి యూపీహెచ్‌సీలకు చెందిన ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో శిశు మరణాల రేటు తగ్గింపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రిజం-10లో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలపై మాట్లాడారు. మాతాశిశు ఆరోగ్య రక్షణకు అందరూ నిబద్ధతతో పనిచేయాలన్నారు. ప్రభుత్వం సమకూర్చుతున్న పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలన్నారు. కేంద్ర వైద్య బృందం జిల్లాలో ఎక్కడికైనా వెళ్లవచ్చని, సిబ్బంది అంతా తగు సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వేణు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల నిధి..


ఈ-గ్రంథాలయం

ఈ-గ్రంథాలయం.. విద్యార్థులకు విజ్ఞానం పంచే పుస్తకాల నిధి. ఎంతో విలువైన పుస్తకాలు కేవలం ఒక్క క్లిక్‌తో కళ్లముందు సాక్షాత్కరిస్తాయి. ఉన్నత చదువులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారు సులభంగా పుస్తకాలు పొందవచ్చు. లక్ష్య సాధనకు అవసరమైన మెటీరియల్‌ను సొంతం చేసుకోవచ్చు.

- వెబ్‌సైట్‌లో ఇంజినీరింగ్, మెడికల్, సివిల్స్ పుస్తకాలు లభ్యం
- ఓపికతో శోధిస్తే విజ్ఞానం మీ సొంతం



కంప్యూటర్ ముందు కూర్చొని తమకు కావాల్సిన స్టడీ మెటీరియల్‌ను శోధిస్తున్న విద్యార్థులు



విజయనగరం:

'రాజేష్ అనే నిరుపేద విద్యార్థికి ఎంసెట్‌లో మంచి ర్యాంకు వచ్చింది. ఇంజినీరింగ్ కాలేజీలో కోరుకున్న కోర్సులో ఉచిత సీటు లభించింది. ఆర్థిక స్తోమత లేని తమ తల్లిదండ్రులు ఫీజు భారం తప్పినందుకు సంతోషపడ్డారు. వేలాది రూపాయల్లో ఉన్న పుస్తకాల ధరలను చూసి ఏం చేయాలో తెలియక అయోమయంలో పడ్డారు. తన సీనియర్ అతనికి డిజిటల్ లైబ్రరీని పరిచయం చేశాడు. అంతే.. ఇప్పుడు ఇంటర్నెట్ సెంటర్‌లో రూ.10 వెచ్చించి తనకు కావాల్సిన సమాచారాన్ని సులభంగా తెలుసుకుంటున్నాడు.' రాజేష్ ఒక్కరే కాదు ఉన్నత చదువులు చదువుతున్న ఎంతోమంది పేద విద్యార్థులు ఖరీదైన పుస్తకాలు కొనుక్కోలేక ఇబ్బందిపడుతున్నారు. అలాంటి వారు ఈ-గ్రంథాలయంపై అవగాహన పెంపొందించుకుంటే విజ్ఞానాన్ని సొంతం చేసుకోవచ్చని ఇంజినీరింగ్ అధ్యాపకులు సూచిస్తున్నారు. అన్ని కోర్సులకు సంబంధించిన పుస్తకాలు ఇబ్బడిముబ్బడిగా వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వచ్చాయి. పాఠ్యాంశాలే కాకుండా, వ్యక్తిత్వ వికాసం, ఆంగ్లభాష, పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ ఇలా అనేకం వెబ్‌సైట్‌లో పొందుపరిచి ఉన్నాయి.

● విజ్ఞాన పరిజ్ఞానం కోసం...

ప్రస్తుతం పట్టణంలో ఉన్న ఇంజినీరింగ్, మెడిసిన్, ఎంసీఏ తదితర కళాశాలల్లో డిజిటల్ ఈ-గ్రంథాలయాలు ఉన్నాయి. కళాశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థులు వీటిని వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. గతంలో ఖరీదైన పుస్తకాలను కొనుక్కోలేనివారు వాటిని అద్దెకు తెచ్చుకుని చదివి తిరిగి ఇచ్చేవారు. ఇప్పుడు ఈ సౌలభ్యం చాలా చోట్ల లేదు. ఉన్న చోట్ల పుస్తకాల అద్దె భారీగానే వసూలు చేస్తున్నారు. ఫలితంగా విషయాన్వేషణలో అవరోధాలు ఏర్పడుతున్నాయి. అలాంటి వారికి ఉచితంగా అందుబాటులో ఉండే ఈ-గ్రంథాలయాలు గొప్పవరమనే చెప్పాలి. ఇంజినీరింగ్, మెడిసిన్, ఐటీ కోర్సుల పుస్తకాల ధరలు ఈ ఏడాది రూ.50 నుంచి రూ.100 వరకు పెరిగినట్టు సమాచారం. ఇంజినీరింగ్ విద్యార్థి ఒక్కో పుస్తకానికి రూ.600 నుంచి రూ.1000 వరకు వెచ్చించాల్సి వస్తోంది. ఎంబీఏ, ఎంసీఏ పుస్తకాల ధరలు సైతం ఇదే విధంగా ఉన్నాయి. వైద్య విద్యకు సంబంధించిన పుస్తకాలు రూ.వెయ్యికి తక్కువగా ఎక్కడా లభించడం లేదు. కేవలం కాలేజీ గ్రంథాలయాల్లోనే విద్యార్థుల కోసం డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నారు.

● ఎన్నెన్నో గ్రంథాలు

పోటీ పరీక్షలకు ఈ గ్రంథాయాలు అక్షయపాత్రలని చెప్పాలి. విశిష్టమైన వ్యక్తుల జీవిత చరిత్రలు, చారిత్రక సంఘటనలు వంటి ఎన్నో అరుదైన గ్రంథాలను చదివి లోతైన విషయ పరిజ్ఞానాన్ని సొంతం చేసుకోవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే డబ్బు చెల్లించినా మన గ్రంథాలయాల్లో దొరకని ఎన్నో అమూల్యమైన పుస్తకాలను పొందవచ్చు. వెబ్‌సైట్‌లో అనేక పుస్తకాలు ఉచితంగా దొరుకుతున్నా, కాపీరైట్ హక్కులు ఉన్న పుస్తకాలు లభించే అవకాశం లేదు. అలాంటి వారికి అద్దెపై పుస్తకాలు తీసుకోవడం లేదా కొనుగోలు చేసే అవకాశం కూడా ఉంటుంది.

ఇది మీకు తెలుసా...?

దేశంలో 18వ శతాబ్దం మధ్య కాలంలో కోల్‌కతా పౌరగ్రంథాలయం, ఇంపీరియల్ గ్రంథాలయం ఏర్పడ్డాయి. 1953లో ఇంపీరియల్ గ్రంథాలయాన్ని భారత ప్రభుత్వం జాతీయ గ్రంథాలయంగా మారుస్తూ వేల పుస్తకాలను అందులో భద్రపరుస్తూ వచ్చింది. 2002 సంవత్సరంలో దీనిని ఇంటర్నెట్‌కు అనుసంధానం కూడా చేసింది.

దృష్టి పెడితే దొరకని సమాచారం లేదు

ప్రస్తుతం సాంకేతిక ఎంతో అభివృద్ధి చెందింది. ఇందులో భాగంగా ఇంటర్నెట్ వినియోగం గణనీయంగా పెరిగింది. ఇంటర్‌నెట్‌లో ఓపికతో వెతికితే దొరకని పుస్తకమంటూ ఏదీ ఉండదు. జాగ్రత్త కూడా చాలా అవసరం. కొన్ని సార్లు మనకు కావాల్సిన పుస్తకాల పేర్లతోనే సాధారణ రచయితలు రాసిన నాణ్యత లేని పుస్తకాలు ఉంటాయి. ఈ విషయంలో సీనియర్ల సహాయం తీసుకోవడం మంచిది. దాదాపు అన్ని కళాశాలల్లో ఉచితంగా డిజిటల్ లైబ్రరీలు అందుబాటులో ఉండటంతో పుస్తకాలు దొరకవన్న చింత అవసరం లేదు.

– హంసా నందిని, ఇంజినీరింగ్ విద్యార్థి, విజయనగరం

బాధిత కుటుంబాలకు అన్నివిధాలా అండ

- టీడీపీ దాడులతో నష్టపోయినవారికి తోడుగా కమిటీ
- రాష్ట్రంలో నెలకొన్న భయానక పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ అధిష్టానం భరోసా

సాక్షి ప్రతినిధి, విజయనగరం: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత టీడీపీ దాడులు పెరిగిపోయాయి. ప్రభుత్వం ఏర్పాటుకాకముందే ముఠాలు రాష్ట్రవ్యాప్తంగా చెలరేగిపోతున్నాయి. ఎక్కడికక్కడ దాడులకు తెగబడుతున్నారు. దౌర్జన్యాలకు దిగుతున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారు. వారిపట్ల అత్యంత పాశవికంగా ప్రవర్తిస్తున్నారు. ఫలితంగా అత్యంత భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలకు అన్నివిధాలా ఉండాలని వైఎస్సార్‌సీపీ అధిష్టానం స్పందించింది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ నాయకులతో కమిటీలను ఏర్పాటుచేసింది. ప్రతి కార్యకర్తకు, అక్కచెల్లెమ్మలకు, అన్నదమ్ములకు, సోషల్ మీడియా సైనికులకు ఈ కమిటీలు తోడుగా నిలుస్తాయి. టీడీపీ దాడులతో నష్టపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించి భరోసా ఇవ్వనున్నాయి. వారి న్యాయపోరాటానికే గాకుండా వైద్యపరంగా, ఆర్థికంగానూ సహాయంగా నిలుస్తాయి. తొమ్మిది మంది నాయకులతో విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గం కమిటీని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం సాయంత్రం ప్రకటన విడుదల చేసింది.

కమిటీ సభ్యులు వీరే...

- బొత్స సత్యనారాయణ
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)
- ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు
- కోలగట్ల వీరభద్రస్వామి
- బెల్లాన చంద్రశేఖర్
- శంబంగి వెంకట చిన్నఅప్పలనాయుడు
- బొత్స అప్పలనర్సయ్య
- బడ్డుకొండ అప్పలనాయుడు
- డాక్టర్ తలే రాజేష్

గురజాడ గృహాన్ని సందర్శించిన ఎన్నికల అధికారి



మహాకవి రాసిన కన్యాశుల్కం పుస్తకాన్ని ఎన్నికల అధికారికి అందజేస్తున్న గురజాడ మునిమనవడు ప్రసాద్, ఇందిరలు

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ వేంకట అప్పారావు స్వగృహాన్ని అస్సాం రాష్ట్రం నుంచి ఎన్నికల నిర్వహణకు వచ్చిన డాక్టర్ దెబిజిత్ కనికర్ (ఐఆర్ఎస్) గురువారం పర్యాటకశాఖ అధికారి లక్ష్మీనారాయణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గురజాడ మునిమనవడు గురజాడ వెంకటప్రసాద్, ఇందిరలు వారికి గురజాడ ఇంటిని, మహాకవి వాడిన వస్తువులను, ఫొటోలను చూపించారు. ఆయన విజిటర్స్ డైరీలో సంతకం చేసి ఆనందం వ్యక్తం చేశారు. కన్యాశుల్కం పుస్తకాన్ని ఆయనకు బహుమతిగా అందజేశారు.

మన్యం తాండ్ర మహారుచి

- కొండమామిడి పండ్లతో తాండ్ర తయారీ
- కిలో రూ.200 నుంచి 300ల మధ్య విక్రయం
- ఆవకాయ చేసుకునేందుకు అంబుల్లి తయారీ
- వారపు సంతల్లో విక్రయాలు
- మైదాన ప్రాంతాల వ్యాపారులు కొనుగోలు



తాండ్రను ఎండలో ఆరబెట్టిన గిరిజనులు

సీతంపేట:

మన్యం అటవీ ప్రాంతంలో లభించే మామిడి పండ్లతో తయారు చేసే తాండ్ర తింటే మహారుచిగా ఉంటుంది. గిరిజన మహిళలు సంప్రదాయబద్ధంగా తాండ్రను తయారు చేస్తారు. ఎలాంటి రసాయనాలు వినియోగించరు. అందుకే మన్యం తాండ్రకు మంచి గిరాకీ ఉంటుంది. గిరిజన గ్రామాల మహిళలు ప్రస్తుతం ఇళ్లముందు చేటలు, చాపలు, ప్లేట్లతో మామిడి తాండ్ర తయారీలో నిమగ్నమయ్యారు. వారపు సంతలో తాండ్ర కిలో రూ.200 నుంచి 300ల వరకు విక్రయిస్తున్నారు. మామిడి పండ్ల సీజన్ అయిపోయినా తాండ్రను భద్ర పరుచుకొని తినే అవకాశం ఉండడంతో డిమాండ్ నెలకొంది.

● సహజ సిద్ధంగా తయారీ...

మన్యంలో గిరిజన గ్రామాలకు ఆనుకుని ఉన్న కొండ అటవీ ప్రాంతాల్లో మామిడి చెట్లకు కాసే మామిడి పండ్లను ఇంటిల్లిపాది ఉదయం, సాయంత్రం సమయాల్లో వెళ్లి సేకరిస్తారు. వాటిని శుభ్రపరిచి పెద్దడబ్బాలు, బిందెలలో వేసి రోకలితో దంచుతారు. దంచగా వచ్చిన మామిడి రసాన్ని చేటలు, పేట్లు, చాపలలో పలుచుగా, పొరలుపొరలుగా వేసి వారం పదిరోజులు ఆరబెడతారు.

● అంబుల్లి అదుర్స్...

మామిడి పండ్లను కోసి వాటి తొక్కలను, టెంకలను వేరు చేసి ఎండబెడతారు. తొక్కలను కొందరు కా రంతో, మరికొందరు బెల్లంతో కలిపి ఎండబెడతా రు. బాగా ఎండిన తర్వాత వీటిని డబ్బాలలో నిల్వచేసి తింటారు. వీటిని అంబుల్లి అంటారు. మైదాన ప్రాంతాల్లో వీటికి కూడా మంచి డిమాండ్ ఉంది. బుట్టలు లెక్కన విక్రయిస్తారు. ఒక్కో బుట్ట అంబు ల్లి రూ.400ల వరకు విక్రయిస్తారు. మైదాన ప్రాంత వాసులు తీపి ఆవకాయ మాదిరిగా తయారు చేసి తింటారు.

మార్కెట్‌లో ధర తక్కువ



మార్కెట్‌లో తాండ్రకు, అంబుల్లికి ధరలు తక్కువగా ఉంటున్నాయి. ఎప్పుడు ఒకే ధరకు విక్రయించాల్సిన పరిస్థితి. గతేడాది కూడా ఇవే ధరలు ఉన్నాయి. ఇప్పుడు కూడా మార్పు లేదు. ఇంటి అవసరాలకు ఉంచుకోగా మిగిలినది సంతల్లో విక్రయిస్తాం. – బాపయ్య, దీసరిగూడ

తయారీ కష్టమే



తాండ్ర తయారు చేయడం చాలా కష్టమైన పని. కొండ ప్రాంతాల్లో ఉన్న పుల్లని మామిడి పండ్లను మాత్రమే దీనికి వినియోగిస్తాం. ఇంటిల్లిపాది మామిడి పండ్లను కోసి వాటి తొక్కలను తీసివేసి రసాన్ని ఆరబెట్టి తాండ్రరూపంలో తయారు చేస్తాం. అలాగే, తొక్కలను ఎండబెట్టి అంబుల్లి తయారు చేస్తాం. ఇది కూడా రుచిగానే ఉంటుంది.

– ఎస్.భూదమ్మ, వలగజ్జిగూడ

ప్రజా సేవలోనే ఉందాం



గరివిడి క్యాంప్ కార్యాలయంలో పార్టీ క్యాడర్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

- ఎంతో అభివృద్ధి చేశాం.. అయినా ప్రజలు మార్పు కోరారు
- ఓటమి కొత్తేమీ కాదు.. సంయమనం పాటించండి
- 30 ఏళ్ల మన బంధాన్ని కొనసాగిద్దాం
- అధిష్టానం ఇచ్చే ప్రణాళిక ప్రకారం కార్యచరణ రూపొందిద్దాం
- మనకు రెస్ట్ ఇచ్చారు.. అభివృద్ధి చేయమని వారికి అవకాశం ఇచ్చారు
- మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి: నిరంతరం ప్రజల మధ్యనే ఉన్నాం.. 24/7 మాత్రమే కాకుండా 365 రోజులు ప్రజాసేవనే పరమావధిగా సేవలు అందించాం... ఎంతో అభివృద్ధి చేశాం.. కానీ ప్రజలు ఇంకా అంతకుమించి సేవ, అభివృద్ధి కోరుకున్నారేమో తెలియదు గానీ మార్పు కావాలంటూ ఓటు మార్చారు. అందుకోసం క్యాడర్ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలి. ప్రజాసేవలోనే ఉందామని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గరివిడిలోని తన క్యాంప్ కార్యాలయానికి గురువారం సాయంత్రం వచ్చిన ఆయనను చీపురుపల్లి నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున వచ్చి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో లేని సంక్షేమ పరిపాలన, అభివృద్ధి ఫలాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించారని, అయినప్పటికీ ప్రజలు మార్పు కోరుకున్నారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఓటు మార్చి మనకు రెస్ట్ ఇచ్చారని, అభివృద్ధి చేసేందుకు వారికి అవకాశం ఇచ్చారని చెప్పారు. ప్రజలు ఆలోచన ప్రకారం ఇంకా మంచిగా అభివృద్ధి చేయాలని నూతనంగా గెలిచిన వారిని కోరారు. 24/7, 365 రోజులు సేవలు అందించాల్సిన అవసరం లేదని తాజా ఫలితాల్లో ప్రజలు తీర్పు చెప్పారని, అయినప్పటికీ మనమంతా మన విధానంలో నిరంతరం ప్రజలకు అండగా అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తూ చక్కని మానవ సంబంధాలు కొనసాగిద్దామని పునరుద్ఘాటించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతినెలా ఉదయం 5 గంటలకే ఇంటికి వెళ్లి రూ.3 వేలు పింఛన్ అందజేసామని, తాజాగా గెలిచిన ప్రభుత్వం తెల్లవారు జామున 4 గంటలకే వెళ్లి రూ.4 వేలు పింఛన్ ఇస్తుందేమోనని వేచి చూడాలన్నారు. మూడు దశాబ్దాలుగా కలిసి పనిచేస్తున్న తమ బంధాలు ఇలాగనే కొనసాగిద్దామని, ఎవరికీ ఎలాంటి కష్ట, సుఖాల్లోనైనా పెద్దలంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మనకు ప్రభుత్వం లేకపోయినప్పటికీ ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీ, జిల్లా పరిషత్‌లో మనమే పాలకులుగా ఉన్నామని, అదే వేదికలుగా ప్రజా సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

ఎంతో అభివృద్ధి చేశాం

చీపురుపల్లి నియోజవకర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు పూర్తిచేశామని బొత్స స్పష్టం చేశారు. తాజాగా రెవెన్యూ సబ్ డివిజన్, పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు చేసుకున్నట్టు చెప్పారు. అలాగే, వంద పడకల ఆస్పత్రి, ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నికల్ కళాశాలలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. 90 శాతం రహదారులు నిర్మించుకున్నామని తెలిపారు. సాగునీటి కోసం తోటపల్లి కాలువ తీసుకొచ్చామన్నారు.

పార్టీ అధిష్టానం నుంచి ప్రణాళిక వస్తుంది

మరికొద్ది రోజుల్లో పార్టీ అధిష్టానం నుంచి ప్రణాళిక వస్తుందని, అందుకు అనుగుణంగా కార్యచరణ రూపొందించుకుందామని బొత్స చెప్పారు. పార్టీ ఆదేశాలు ప్రకారం ప్రతి గ్రామంలో పర్యటిద్దామన్నారు. ఎవ్వరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. ప్రతి మండలానికి ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి అందులో మండలానికి సంబంధించి ప్రతీ అంశాన్ని షేర్ చేయాలని సూచించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీకు ఓటమి కొత్త కాదని కార్యకర్తలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ నాయకత్వంలో నిరంతరం క్యాడర్‌తో పాటు ప్రజలకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో-ఆర్డినేటర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ప్రజల పక్షాన పోరాటం వైఎస్సార్‌సీపీ పార్టీకు, అధినేత జగన్‌మోహన్‌రెడ్డికు కొత్తేమీ కాదన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజలకు మంచి చేయాలని ఆశిద్దామన్నారు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అతి తక్కువ మెజారిటీతో బొత్స ఓటమి పాలయ్యారన్నారు. మాజీ మంత్రి బొత్స, తన విజయం కోసం అహర్నిశలు కృషిచేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో లేని విధంగా జిల్లాలో మెడికల్ కళాశాల ప్రారంభం, ఎయిర్‌పోర్ట్ కోసం శంకుస్థాపన చేసుకున్నట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బొత్స సందీప్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణ రాజు, నాలుగు మండలాలకు చెందిన నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వరరావు, కొణిశ కృష్ణంనాయుడు, వాకాడ శ్రీనివాసరావు, బమ్మిడి కార్తీక్, కోట్ల వెంకటరావు, తాడ్డి వేణు, బూర్లె నరేష్, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, పొట్నూరు సన్యాసినాయుడు, శీర అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

క్లుప్తంగా

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు



మండల కేంద్రంలోని పురుగు మందుల దుకాణంలో నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కురుపాం: మండల కేంద్రంలో ఉన్న పలు పురుగు మందుల విక్రయ దుకాణాల్లో వ్యవసాయాధికారి పువ్వల నాగేశ్వరరావు, రైతు భరోసా కేంద్రం వీహెచ్ఏ మౌనిక గురువారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. గురువారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన నిషేధిత క్రిమిసంహారక మందు (గ్లైఫోసైల్) అక్రమ రవాణా అనే కథనంపై స్పందించిన పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు కురుపాం మండల వ్యవసాయాధికారులు స్థానిక పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. నిషేధిత పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించి, పురుగుమందుల నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు.

రెండు కేంద్రాల్లో ఎడ్‌సెట్ -2024 రేపు



డాక్టర్ ఎస్.శ్రీనివాస మోహన్, ఎడ్‌సెట్ జిల్లా కో–ఆర్డినేటర్

విజయనగరం అర్బన్: బీఈడీ డిగ్రీ ప్రవేశాలకు సంబంధించిన ఎడ్‌సెట్ -2024 ప్రవేశ పరీక్షను ఈ నెల 8న జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాల్లో జరుగుతుందని ఎడ్‌సెట్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్రీనివాసమోహన్ తెలిపారు. జిల్లాలోని సీతం ఇంజినీరింగ్ కళాశాల, గాజులరేగలోని ఐయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహస్తామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల మధ్య ఈ పరీక్ష జరుగుతుందని కనీసం ఒక గంట ముందు పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని సూచించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 850 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నారని వివరించారు.

డైరెక్టర్ పదవులకు రాజీనామా



నౌపాడ శ్రీనివాసరావు



రేగాన శ్రీనివాసరావు

నెల్లిమర్ల: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి పాలైనందున నైతిక బాధ్యత వహిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం బోర్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రేగాన శ్రీనివాసరావు, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి నౌపాడ శ్రీనివాసరావు రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ రాజీనామా పత్రాలను మెయిల్ ద్వారా రాష్ట్ర కార్యాలయాలకు పంపించినట్లు పేర్కొన్నారు. ఇంతవరకు తమకు సహకరించిన పార్టీ నాయకులు, అన్ని వర్గాల ప్రజలు, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

పర్యావరణ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



జ్ఞాపికలతో విజేతలు

విజయనగరం అర్బన్: పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో పర్యావరణంపై వివిధ అంశాల్లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పట్టణంలోని గరజాడ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పలువురు విజేతలుగా నిలిచారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూడి శేఖర్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వ్యాసరచనలో జి.జ్యోతికకు ప్రథమ, కె.లక్ష్మీ శ్రీవాణి, కె.తనూజ, బి.సాయిసంయుక్తలకు ద్వితీయ బహుమతులు లభించాయి. వక్తృత్వ పోటీలో కె.లక్ష్మీ శ్రీవాణి, కె.తనూజ ప్రథమ బహుమతులు, జి.జ్యోతిక ద్వితీయ బహుమతి సాధించారు. చిత్రలేఖనంలో బి.బిందుప్రియకు ప్రథమ, ఒ.శశివర్ధన్‌కు తృతీయ బహుమతి లభించాయని ప్రకటనలో వివరించారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹270

కాటేసే కాలం



- ఖరీఫ్‌లో విషసర్పాలతో జాగ్రత్త
- వానాకాలంలో పాముల సంచారం ఎక్కువ
- పొలాల్లోనే ప్రమాదం
- రైతులు అప్రమత్తంగా ఉండాలి



పొలం పనులు చేస్తున్న రైతు

సీతంపేట/పార్వతీపురం టౌన్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వానాకాలం ప్రారంభంలో విషసర్పాల బెడద ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు గతంలో పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం రైతులు ఎక్కువగా పొలాల్లో గడుపుతారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఈనెల నుంచి సెప్టెంబరు వరకు పాములు, ఇతర విషకీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. గతేడాది పార్వతీపురం మన్యం జిల్లాలో 12 మంది రైతులు పాము కాటుతో ప్రాణాలు కోల్పోగా, 15 మంది ఆస్పత్రులకు వెళ్లి కోలుకున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

పొలాల గట్ల మీద వెళ్లేటపుడు కర్ర చప్పుడు చేస్తూ నడవడం మంచిది. రాత్రి పూట పొలాలకు నీరు కట్టడానికి వెళ్లినప్పుడు టార్చిలైట్ తీసుకువెళ్లాలి. ధాన్యపు గాదెలు, గడ్డివాములు ఉండే చోట ఎలుకలు తిరుగుతాయి. తడిగా ఉంటే కప్పలు చేరతాయి. వాటిని తినడానికి పాములు చేరతాయి. అలాగే తేళ్లు వంటి ప్రమాదకర ప్రాణులు తిరుగాడే ఆస్కారముంది. ఇంటిచుట్టూ పరిశుభ్రంగా ఉండాలి. ఎక్కువగా పాములు పొదల్లోనే ఉంటాయి. గోడల పక్కన చేరతాయి. చీకట్లో బయటకు వెళ్తే తప్పనిసరిగా చెప్పులు వేసుకోవాలి.

అన్ని పాములు ప్రమాదకరం కాదు..

పాముల్లో చాలా వాటికి విషం ఉండదు. కట్లపాములే ప్రమాదకరమైన సర్పజాతులు. వాటితోనే ఎక్కువ ప్రమాదముంటుంది. సాధారణంగా 50 శాతం పాముకాట్లు విషం ప్రమాదం లేని మామూలు గాయాలే. సాధారణ చికిత్స తీసుకుంటే నయమవుతాయి. పాముల కన్నా చాలా మంది షాక్‌తోనే ప్రాణం మీదకి తెచ్చుకుంటారు. ఇంట్లోవారు ధైర్యం చెప్పడానికి బదులు ఏడిస్తే బాధితుడు భయాందోళనకు గురై పరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది.

ఇలా చేయకూడదు..

పాము కాటు వేయగానే కొందరు ఆ గాయాన్ని మరింతగా కోస్తే రక్తంతో పాటు విషం వచ్చేస్తుందని కత్తితో, బ్లేడుతో గాటు పెడతారు. అలా చేయవద్దు. ఒక్కోసారి పాముకాటు కన్నా ఈ ఆ గాయం ప్రమాదకరంగా మారవచ్చు.

పాము కాటు లక్షణాలు

పాముకాటుకు గురైన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ఆందోళన చెందితే గుండెపోటుకు గురయ్యే ప్రమాదముందని పేర్కొంటున్నారు. ప్రథమ చికిత్సలో భాగంగా పాము కాటు వేసిన చోట కట్టువేయాలి. వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలి.

- పాము కాటు వేసిన ప్రదేశంలో కోరల గాయం స్పష్టంగా కనిపించి, నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్టు, గొంతు కండరాలు బిగుసుకున్నట్టు గొంతులో ఏదీ దిగని పరిస్థితి తలెత్తవచ్చు.
- కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.

అందుబాటులో వ్యాక్సిన్



పాముకాటు బారిన పడిన వ్యక్తికి పీహెచ్‌సీలో చికిత్స అందుబాటులో ఉంది. వారికి కావాల్సిన యాంటీ స్నేక్‌వీనం ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళన, భయం చెందకుండా నిర్భయంగా ఉండాలి. కరిచిన వెంటనే ముందుగా గాయం పై భాగాన్ని వస్త్రంతో గట్టిగా లాగి కట్టి ఉంచాలి. వెంటనే దగ్గరలోని ఆస్పత్రిలో ప్రథమ చికిత్స తీసుకోవాలి. గాయాన్ని బట్టి రెండుసార్లు స్నేక్‌వీనం డోస్ తీసుకుంటే ఎటువంటి ప్రమాదం ఉండదు. ముఖ్యంగా భయపడకుండా ఉండాలి.

కె.విజయపార్వతి, డీఎంహెచ్‌వో

పీహెచ్‌సీల్లో ఇంజక్షన్లు



జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో పాము కాటుకు యాంటీ స్నేక్ వీనమ్ మందు అందుబాటులో ఉంది. పాముల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పాము కరిచిన వెంటనే ఏదైనా వాహనంలో ఆరోగ్యకేంద్రానికి చేర్చాలి. నడిపించకూడదు.

– డాక్టర్ బి.వాగ్దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, పార్వతీపురం మన్యం

పాములు-విషప్రభావం..

కట్ల పాము: ఇది కాటేసిన క్షణాల్లోనే విషం రక్తకణాల్లో కలుస్తుంది. వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలి.

నాగుపాము: ఇది కాటేసిన 15 నిమిషాల్లో శరీరంలోకి విషం ఎక్కుతుంది.

రక్తపింజర: ఇది కాటేసిన రెండు గంటల తర్వాత విషం శరీరంలోకి ఎక్కుతుంది.

జెర్రిపోతు, నీరుకట్టు: ఇవి కాటేసినా విషం ఉండదు. అయితే ఇవి కాటువేసినా ఆస్పత్రిలో చికిత్స అవసరం.

కూటమి శ్రేణుల కవ్వింపు

- కులం పేరుతో దూషణ, ఆటో ధ్వంసం



ఆవేదన వ్యక్తం చేస్తున్న దాలప్పడు

నెల్లిమర్ల రూరల్: ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమనే మాటను మరిచిపోయి కూటమి శ్రేణులు కవ్వింపు చర్యలకు పాలపడుతున్నాయి. బలహీనవర్గాలనే లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగుతున్నాయి. ఈ క్రమంలో నెల్లిమర్ల మండలంలోని కొండగుంపాం గ్రామంలో పలువురు టీడీపీ–జనసేన కార్యకర్తలు.. డీజే సౌండ్‌లతో భారీ ఎత్తున విజయోత్సవ ర్యాలీని బుధవారం రాత్రి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడు, నిరుపేద కుటుంబానికి చెందిన అలజంగి దాలప్పడు ఇంటి ఎదుట చేశారు. దాలప్పడు కుటుంబసభ్యులను తీవ్ర భయభ్రాంతులకు గురిచేసి ఆటో అద్దాలను, ఇంటి ఎదుట ఉన్న సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా బాధితుడు దాలప్పడు మాట్లాడుతూ..రాత్రి 10.30 గంటల సమయంలో ఇంట్లో టీవీ చూస్తుండగా ర్యాలీలో ఉన్న పతివాడ అప్పారావు, మొయిద లక్ష్మణరావు, వలిరెడ్డి ప్రసాద్, తదితరులు కేకలు వేస్తూ తమను భయభ్రాంతులకు గురి చేశారని తెలిపాడు. ఇంట్లో చిన్నపిల్లలు ఉన్నారని, నెమ్మదిగా ఉండాలని చెప్పిన పాపానికి, కులం పేరుతో, తీవ్ర పదజాలంతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశాడు. తీవ్ర స్థాయిలో గొడవపడి ఇంటి ముందున్న ఆటోను సదరు ముగ్గురు వ్యక్తులు ధ్వంసం చేశారని చెప్పాడు. ఈ మేరకు నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, పోలీస్ అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరాడు.



టీడీపీ-జనసేన కార్యకర్తల దాడిలో ధ్వంసమైన ఆటో

ఇసుక లారీ పట్టివేత

గుర్ల: మండలంలోని కోటగండ్రేడు సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని ఎస్ఈబీ అధికారులు గురువారం పట్టుకున్నారు. పట్టుకున్న లారీని గుర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని నెల్లిమర్ల ఎస్ఈబీ అధికారులు హెచ్చరించారు.

వేధింపుల భర్త అరెస్ట్

మక్కువ: మండలకేంద్రం మక్కువలోని ఎస్సీ కాలనీకి చెందిన మాధురి గతనెల 22వతేదీన ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ ఈనెల 1వతేదీన మృతిచెందింది. మాధురి భర్త కృష్ణ వేధింపుల వల్లను ఆమె మృతిచెందినట్లు మృతురాలి సోదరుడు సురేష్ పోలీసులకు ఫిర్యాదుచేయగా, దర్యాప్తు నిర్వహించి, భర్త కృష్ణను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పి.నరసింహమూర్తి గురువారం విలేకరులకు తెలిపారు.

విత్తనోత్పత్తి రైతులే చేసుకోవాలి

- సొంతంగా తయారు చేస్తే నాణ్యమైన విత్తనాలు

విజయనగరం ఫోర్ట్:

పంటల సాగుకు విత్తన ఎంపికే కీలకం. విత్తు కొద్దీ చెట్టు అనే సామెత నిజం కావాలంటే ముందు విత్తనం నాణ్యమైనదై ఉండాలి. వ్యవసాయంలో మంచి విత్తనం సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించడంతో పాటు తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చు. గతంలో విత్తనాలను పూర్తి స్థాయిలో రైతులే సొంతంగా తయారు చేసుకునే వారు. అయితే ఇటీవల కాలంలో రైతులు విత్తనాలు తయారు చేసుకోవడం చాలా వరకు తగ్గించేశారు. ప్రస్తుతం రబీలో వరి పంట సాగులో ఉంది. రైతులకు అవసరమయ్యే విత్తనాల్లో కనీసం సగం విత్తనాలు అయినా రైతు తయారు చేసుకుంటే మంచిదని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు.

విత్తనాల తయారు చేయని రైతులు

జిల్లాలో రైతులు విత్తనాలు తయారు చేయడం లేదు. గతంలో తనకు ఉన్న పొలంలో విత్తనాల కోసం కొన్ని సెంట్లలో సాగు చేసేవారు. వాటిని విత్తనాల కోసం ప్రత్యేకంగా జాగ్రత్తలు పాటిస్తూ నిల్వ చేసుకునేవారు. దీంతో రాయితీ విత్తనాలు పెద్దగా రైతులకు అవసరం పడేవి కాదు.

ఖరీఫ్‌లో 90 వేల హెక్టార్లలో వరి సాగు

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వరి పంట90 వేల హెక్టార్లలో సాగవుతోంది. రబీలో 2 వేల నుంచి 3 వేల హెక్టార్ల వరకు సాగవుతుంది. ఈ విస్తీర్ణానికి మొత్తంగా 80 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం పడతాయి.



విజయనగరం మండలం పినవేమలి గ్రామంలో సాగులో ఉన్న వరి పంట

విత్తనం తయారీ ఇలా:

వరి పండించిన పొలాన్ని విత్తనోత్పత్తి కోసం ఎంపిక చేసుకోవాలి. ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది. సరైన వరి వంగడాలను ఎన్నుకున్న తర్వాత పండించాలనుకున్న వరి రకాలలో బ్రీడర్ లేదా మూల విత్తనాన్ని సేకరించాలి. విత్తన శుద్ధి కోసం ఒక కిలో విత్తనాలకు 3 గ్రాముల కార్బండిజిమ్ మందును కలుపుకోవాలి. తర్వాత ప్రధాన పొలానికి 10 నుంచి 15 రోజులు నీరు పెట్టి మురుగుదమ్ము చేసుకోవాలి. విత్తనం నాటిన తర్వాత ప్రతి 2 మీటర్లకు 20 సెంటీమీటర్లు కాలిబాటలు తీసుకోవాలి. సిఫార్సు చేసిన నత్రజని, బాస్వరం, పొటాష్ ఎరువులు భూసారాన్ని బట్టి వేసుకోవాలి. ప్రధాన పొలంలో నాటిన 3నుంచి 5 రోజులు, 15 నుంచి 30 రోజులకు కలుపు నివారణ చర్యలు తీసుకోవాలి.

కేళీల ఏరివేత

సాధారణ పంటకు చేపట్టిన మాదిరిగానే నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి. వరి పంట అంకురం దశనుంచి పక్వానికి వచ్చేవరకు నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. విత్తనోత్పత్తి తయారు చేసుకునే పద్ధతిలో ముఖ్యమైన చర్యలు కేళీలను తీసివేయడం. కేళీలు తీసివేసే పనిని రింగింగ్ అంటారు. కనీసం 3–4 దశల్లో కేళీలు తీసివేయాలి. విత్తనంలో కేళీ గింజలు ఒకటి ఉంటే వచ్చే సంవత్సరానికి 1000 గింజలకు పెరుగుతాయి.

విత్తనాల ఖర్చు తగ్గుతుంది

రైతులు సొంతంగా విత్తనాలు తయారు చేసుకుంటే నాణ్యమైన విత్తనాలు వస్తాయి. అంతేకాకుండా విత్తనాల కోసం పెట్టే ఖర్చు కూడ తగ్గుతుంది.

నాగభూషణం, ఏడీఏ, విజయనగరం సబ్ డివిజన్

ఒక్క ఫోన్ చేస్తే చాలు

లక్కవరపుకోట: సమాజంలో జరుగుతున్న విపత్కర పరిస్థితుల కారణంగా మహిళలు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వారిని ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు విషయాలకు సంబంధించి టోల్ ఫ్రీ నంబర్లను ప్రవేశపెట్టాయి. వాటిని వినియోగించుకోవాలని ఇప్పటికే పలు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

100 టోల్ ఫ్రీ నంబర్

ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ నుంచైనా వంద నంబర్ డయల్ చేస్తే ఆ కాల్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కి చేరుతుంది. ఫోన్ కాల్ చేసిన వ్యక్తి ఎలాంటి విపత్కర పరిస్థితిలో ఉన్నారో చెబితే చాలు. బాధితులు ఏ ప్రాంతం నుంచి ఫోన్ చేశారో తెలుసుకుంటారు. సమీపంలో ఉన్న పోలీసులు, గస్తీ వాహనాలను అప్రమత్తం చేసి గరిష్ఠంగా 10 నిమిషాల లోపు అక్కడికి పోలీసులు వస్తారు. జీపీఎస్ లొకేషన్ ఆధారంగా ఆ ప్రదేశానికి పోలీసులు చేరుకుని బాధితులు ఎలాంటి పరిస్థితిలో ఉన్నా కాపాడతారు. అవసరమైతే ఘటనా స్థలానికి చేరుకునేంతవరకూ పోలీసులు బాధితులతో ఫోన్‌లో మాట్లాడుతూ వారికి పలు సూచనలు, సలహాలు ఇస్తూ ధైర్యం చెబుతారు.

112

కేంద్ర హోం శాఖ ఈ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.దేశంలో ఎక్కడినుంచైనా ఏ సమయంలోనైనా కాల్ చేయవచ్చు. బాధితులు ఏ రాష్ట్రం నుంచి ఫోన్ చేస్తే ఆరాష్ట్రంలోని పోలీస్ కంట్రోల్ రూమ్‌కి ఫోన్ కాల్ వెళ్తుంది.

182

మహిళలు ఒంటరిగా రైల్లో ప్రయాణిస్తున్నప్పుడు ఎవరి నుంచైనా వేధింపులకు గురైనా, ఆపదలో చిక్కుకున్నా అలాంటి సందర్భాల్లో 182 నంబర్‌కు ఫోన్ చేయాలి. ఆ కాల్ రైల్వే డివిజన్ పరిధిలోని రక్షక దళం(ఆర్‌పీఎఫ్)కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. బాధితులు అందించిన వివరాల ఆధారంగా ఆ రైల్లో ఆర్‌ఫీఎఫ్ సిబ్బంది వెంటనే బోగీలోకి చేరుకుని సాయం అందిస్తారు.

9121211100 వాట్సాప్ నంబర్

మహిళలపై జరుగుతున్న సైబర్ నేరాలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు సైబర్ మిత్ర పేరిట ఈ నంబర్‌ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు అందుబాటులోకి తీసుకు వచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో రక్షణకు దీన్ని ఉపయోగించుకోవచ్చు. ఈ నంబర్‌కు వాట్సాప్ చేయడం, లోకేషన్ పంపించడం ద్వారా ఆపదలో ఉన్నామని పోలీసులకు తెలియజేయవచ్చు. పోలీసులు వెంటనే స్పందించి అవసరమైన సాయం అందిస్తారు. ఈ నంబర్ 24 గంటలు పనిచేస్తుంది.



112 మొబైల్ యాప్

కేంద్ర హోం శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ యాప్ మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- గూగుల్ ప్లేస్టోర్‌లో దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రొఫైల్‌లో పేరు, ఫోన్ నంబర్, పుట్టిన తేదీ, రాష్ట్రం తదితర వివరాలను నమోదు చేసుకోవాలి.
- ఆపదలో ఉన్నప్పుడు ఆ సమాచారం పోలీసులతో పాటు కుటుంబ సభ్యులకు తెలిసేలా ముఖ్యమైన వారి ఫోన్ నంబర్‌లు అందులో సేవ్‌చేసుకోవచ్చు.
- హోం స్క్రీన్‌పైకి వెళ్లిన వెంటనే పోలీస్ అని కనిపిస్తుంది అత్యవసర మీటను నొక్కితే చాలు వారు ఆపదలో ఉన్నట్లు పోలీస్ కంట్రోల్ రూమ్‌కి సమాచారం అందుతుంది. బాధితులు ఉన్న లోకేషన్ వివరాలు కూడా చేరుతాయి.వెంటనే 112 నంబర్ నుంచి కాల్ వస్తుంది. సమీపంలో గల పోలీసులు, గస్తీ వాహనాలు అప్రమత్తమై సాయిమందిస్తాయి.

'లెర్నింగ్' స్కిల్స్‌పై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ పగడాలమ్మ

పార్వతీపురంటౌన్: లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ స్కిల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖ అధికారిణి జి. పగడాలమ్మ అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల రిసోర్స్ పర్సన్స్ రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఈ ట్రైనింగ్‌లో భాగంగా ప్రతి మండలం నుంచి ముగ్గురు చొప్పున 45 మంది మండల రిసోర్స్ పర్సన్స్ హాజరయ్యారన్నారు. వారందరూ ఒకటి, రెండవ తరగతులకు బోధించే మండలంలోని ఉపాధ్యాయులందరికీ ట్రైనింగ్ ఇస్తారని పేర్కొన్నారు. ఈ ట్రైనింగ్‌లో మండల రిసోర్స్ పర్సన్స్ అందరూ చక్కగా అవగాహన కల్పించుకుని మండలాల్లోని ఉపాధ్యాయులందరికీ చక్కగా ట్రైనింగ్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మానిటరింగ్ అధికారి బోను శ్రీనివాసరావు, ఏపీసీ వైకేబీ హరిప్రసాద్ పాల్గొన్నారు.